క్లుప్తంగా

ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించండి

కలకడ : ఉద్యోగులు, పింఛన్‌దారుల సమస్యలను పరిష్కరించడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని పీలేరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఉద్యోగ, పెన్షనర్ల విభాగం అధ్యక్షులు కేతంరెడ్డి లక్ష్మిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కలకడలో ఆయన మాట్లాడుతూ కూటమి నేతలు ఎన్నికల హామీలలో భాగంగా మెరుగైన పీఆర్సీ అమలు చేస్తామని, డీఏలు పెండింగ్‌లేకుండా ఇస్తామన్నారు. అలాగే, సీపీఎస్ రద్దు చేస్తామని, పోలీసులకు సైతం వారాంతపు శెలవులు ఇస్తామని, వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, రూ.10వేలు నెలవారి జీతం చెల్లిస్తామని ఇచ్చిన హామీని గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే సమస్యలపై స్పందించాలని కోరారు.

గ్రామ కార్యదర్శుల అధ్యక్షుడి ఎన్నిక

ములకలచెరువు: ములకలచెరువు మండల పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షుడిగా బురకాయలకోట కార్యదర్శి మొహమ్మద్ అజాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఎంపీడీఓ హరినారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలిగా లావణ్య, సభ్యులుగా శివప్రసాద్ నాయక్,రెడ్డి రాణి, రఘునాథ్ ఎంపికయ్యారు

ఆసిఫ్ కుటుంబానికి పరామర్శ

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం పట్టణం జెట్టిపాళెం వీధికి చెందిన షేక్ ఆసిఫ్(30) రెండు రోజుల క్రితం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కుమారుడు యువనేత చింతల సాయిక్రిష్టారెడ్డి బుధవారం ఆసిఫ్ కుటుంబాన్ని పరామర్శించారు. 2024 ఎన్నికల సమయంలో ఆసిఫ్ తనతో కలిసి చురుగ్గా పాల్గొన్నాడని గుర్తుచేసుకున్నారు. ఆసిఫ్ తండ్రి ఎస్‌కే ఖాదర్ బాషా, సోదరుడు అస్లాంను పరామర్శించి ఓదార్చారు. మంచి స్నేహితున్ని కోల్పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసిఫ్ కుటుంబానికి అండగా ఉండి, ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఏపీపీటీడీ ఈయూ గౌరవాధ్యక్షుడిగా నాగూర్‌వలి

మదనపల్లె రూరల్ : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్(ఏపీపీటీడీ) మదనపల్లె-1, 2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడిగా నాగూర్‌వలి(షోఆఫ్ శీనా) నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఏపీపీటీడీ మదనపల్లె 1,2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడిగా తనను ఎంపిక చేసిన యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవి.నరసయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.వి.కుమార్, స్థానిక డిపోల యూనియన్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎంప్లాయీస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా ఈనెల 11న జరిగే కార్యక్రమంలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిపారు.

మూగజీవాలకు సకాలంలో వైద్య సేవలు



రికార్డులు పరిశీలిస్తున్న పశుసంవర్ధకశాఖ డీడీ నీరజ

తంబళ్లపల్లె: మండలంలో అనారోగ్యం బారిన పడిన మూగజీవాలకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించాలని పశసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ నీరజ తెలిపారు. బుధవారం ఆమె మండలంలో పర్యటించారు. కోటకొండలో పశుగ్రాస వారోత్సాల్లో పాల్గొని మేలైన గడ్డిజాతి విత్తనాలు, వినియోగాలపై రైతులకు వివరించారు. రేణుమాకులపల్లెలో నట్టల నివారణ పంపిణీ కార్యక్రమం తనిఖీ చేశారు. ఉపాధి హామీ పథకంలో పశుగ్రాస పెంపకం పరిశీలించారు. కన్నెమడుగు పశువైద్యశాలను పరిశీలించి రికార్డులు చూశారు. ఆమె వెంట మండల పశువైద్యాధికారి విక్రమ్‌రెడ్డి, .జెవీవీఓ హేమాపతిరెడ్డి,సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల మీట్

పెద్దమండ్యం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీధర్‌రావు తెలిపారు. ఎంపీపీ గుర్రం పూర్ణ చంద్రిక అధ్యక్షతన జరిగే సమావేశానికి ఆయా శాఖల అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని ఆయన కోరారు. సమగ్ర సమాచారంతో తమ శాఖ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనుల వివరాలతో సమావేశానికి రావాలన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

మదనపల్లె సిటీ: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సాయిహితేష్ అన్నారు. బుధవారం ఏబీవీపీ 77వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక కదిరిరోడ్డులోని రంగనాథ ఐటీఐలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఐటీఐ కళాశాల కరస్పాండెంట్ డిఆర్ నరేంద్ర, ఏబీవీపీ నాయకులు వెంకటరమణారెడ్డి, అశ్వత్, గౌతం, చక్రపాణి పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెలో కదం తొక్కిన కార్మికులు

- లేబర్ కోడ్లను రద్దు చేయాలి
- కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి
- పని గంటలు తగ్గించాలి



మదనపల్లెలో ధర్నా చేస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు



పీలేరు: సార్వత్రిక సమ్మెలో వివిధ కార్మిక సంఘ నాయకులు

మదనపల్లె రూరల్ : కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, యాజమాన్యానికి అనుకూలంగా ఉండే లేబర్ కోడ్లుగా మార్చే దుర్మార్గపు ఆలోచనలను ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేస్తూ కార్మిక వర్గం దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. బుధవారం పట్టణంలో సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్, అంగన్‌వాడీ, ఆశావర్కర్స్, హమాలీ వర్కర్స్, పంచాయతీ వర్కర్స్, ఎలక్ట్రిసిటీ, బీఎస్ఎన్ఎల్, బ్యాంకింగ్ రంగంలోని కార్మికులు, ఉద్యోగులు దేశవ్యాప్త సమ్మెలో పాల్గొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఇప్పటివరకు 22 సమ్మెలు జరిగాయని, అయితే ప్రస్తుత దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ప్రత్యేకత ఉందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు రాజేశ్వరి, మధురవాణి, సిఐటియు నాయకులు ప్రభాకర్ రెడ్డి, రామకృష్ణ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు జయమ్మ, సవిత, పంచాయతీ వర్కర్స్ నాయకులు గోపాల్, ఎలక్ట్రిసిటీ యూనియన్ నాయకులు నారాయణ, ఐటీయూసీ నాయకులు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్.నరసింహులు, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి టి.కృష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి మురళీ, ఏఐఎస్ఎఫ్ మాధవ్ అన్నారు. బుధవారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ముబారక్, తిరుమలప్ప, దేవ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చలపతినాయుడు, వాసు, రాధా, ఇంద్రాణి, పి.శ్రీనివాసులు, సాంబశివనాయక్, ఓ.నరసింహులు, చంద్ర, భాగ్యమ్మ, సుగుణమ్మ, మస్తాన్, గంగులప్ప, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్లు రద్దుచేయాలి

నిమ్మనపల్లె : లేబర్ కోడ్లు రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, సంఘమిత్రలు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో నిమ్మనపల్లెలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కందూరు రోడ్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నినాదాలు చేశారు. తహసీల్దార్ తపస్వినికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీఓ జిల్లా అధ్యక్షురాలు ఎస్.రాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు అకీరున్నీసా, సాజిదా, సంఘమిత్రలు దివాలీ, అనూరాధ, రెడ్డిరాణి, గుర్రమ్మ, గౌతమి, రమాదేవి, సుమతి, జయకుమారి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన

రామసముద్రం: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలంటూ రామసముద్రంకు చెందిన అంగన్‌వాడీ ఉద్యోగులు , ఆశావర్కర్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐసీడీఎస్ బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు లేబర్ కోడ్ రద్దు చేయాలని , సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. చెక్‌పోస్ట్ కూడలిలో మానవహారం చేపట్టారు.

పీలేరులో..

పీలేరు రూరల్ : కార్మికులు సాధించుకున్న హక్కులు, చట్టాలను ప్రభుత్వం కాలరాస్తోందని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు అన్నారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నరసింహులు, సీఐటీయూ నాయకులు బి.వి. రమణ, వెంకటరామయ్య, కార్మిక సంఘ నాయకులు ఓబులయ్య, నాగార్జున, రెడ్డెప్ప, రమేష్, గోపి, రాజేశ్వరి, చిట్టెమ్మ, పురుషోత్తం, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన

తంబళ్లపల్లె: సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, అసంఘటిత కార్మికులు సీఐటీయు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ కార్యాలయం నుంచి నినాదాలు చేస్తూ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ యూనియన్ నాయకురాలు సులోచన, కరుణశ్రీలు ఉద్యోగ భద్రత కల్పించాలని ,రూ.26 వేలు జీతం ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని, ప్రభుత్వాలు స్పందించి వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

గుర్రంకొండలో కార్మికుల ర్యాలీ

గుర్రంకొండ/ కలకడ: మండల కేంద్రమైన గుర్రంకొండ, కలకడలో వివిధశాఖలకు చెందిన కార్మికులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్మికుల దేశవ్యాప్త సమ్మె పిలుపు మేరకు బుధవారం కార్యక్రమం నిర్వహించారు. పాత పంచాయతీ కార్యాలయం దగ్గర నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండు వరకు సాగింది. అక్కడే మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేసి వారికి రూ. 26 వేలు జీతాలు ఇవ్వాలన్నారు. రైతులను, ప్రజలను దోచుకొంటున్న స్మార్ట్ విద్యుత్ మీటర్లను వెంటనే తొలగించాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపుకార్డులు ఇచ్చి వారికి అన్నదాత సుఖీభవ, బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజావ్యతిరేక విధానాలను ప్రభుత్వం విడనాడి కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలని అన్నారు. కార్మికుల సమ్మెకు వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దతు ప్రకటించి ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలొ జెడ్పీటీసీ సమ్రీన్‌ముక్తియార్, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు వెంకట్రమణారెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మెహరున్నిసా, సంఘమిత్రలు, ఆశా, అంగన్‌వాడీ వర్కర్ల, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

బి.కొత్తకోట: సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం సీపీఐ, సీఐటీయూ, అంగన్‌వాడీ సంఘ నాయకులు, కార్యకర్తలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యాలయం ఎదుట బైఠాయించి కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పనిగంటల పెంపు తగదన్నారు. కార్యక్రమంలో మనోహర్‌రెడ్డి. సలీం బాషా, వేణుగోపాల్‌రెడ్డి, రఘునాథ్, కుమారి, అష్రఫల్లీ, విమలమ్మ, రమేష్, అమరావతి, సాధిక్, మాలిక్ పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో..

పెద్దమండ్యం: సార్వత్రిక సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు, సంఘమిత్రలు బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బస్టాండు కూడలి నుండి తమ డిమాండ్‌లతో నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. లేబర్స్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. అనంతరం బస్టాండు కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

కార్మికుల నిరసన

పెద్దతిప్పసముద్రం: సీఐటీయూ పిలుపు మేరకు దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం మండలంలోని అంగన్‌వాడీలు, పంచాయతి, స్వచ్ఛ భారత్ కార్మికులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలను రద్దు చేసి కేంద్రం అమల్లోకి తీసుకొచ్చిన లేబర్ కోడ్‌ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల జీవనోపాధులను గుర్తించి సామాజిక భద్రత కల్పించి జీతాలు పెంచాలని సీఐటీయూ నాయకులు సురేంద్రబాబు, శ్రీవాణిల ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు.

కార్మిక సంఘాల నిరసన

ములకలచెరువు: స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద బుధవారం అంగన్‌వాడీతో పాటు వివిధ కార్మిక సంఘాలు నిరసన కార్యక్రమం నిర్వహించాయి. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన లేబర్ కోడ్ ను రద్దు చేయాలన్నారు. ఉద్యోగుల భద్రత, నెలసరి వేతనాలు పంచాలని డిమాండ్ చేశారు. పని భారం తగ్గించాలన్నారు.

కురబలకోటలో..

కురబలకోట: మండలంలోని అంగన్‌వాడీలు, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కార్మికులను బానిసలుగా మార్చేలేబర్ కోడ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం తీసుకు వచ్చిన ఈ చట్టం వల్ల కార్మికుల జీవితం విలువలేనిదిగా మారిందని వక్తలు విమర్శించారు.



గుర్రంకొండలో కార్మికుల ర్యాలీ



బి.కొత్తకోట తహసీల్దార్ కార్యాలయం ఎదుట..



ములకలచెరువు తహసీల్దార్ కార్యాలయం వద్ద..

ఘనంగా మొహర్రం వేడుకలు

గుర్రంకొండ: మండల కేంద్రమైన గుర్రంకొండలో మొహర్రం వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. గత వారం రోజులుగా గ్రామంలోని పీర్ల చావిడ్లలో పీర్లను నిలిపి ప్రతినిత్యం ప్రార్థనలు, పూజలు నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో బుధవారం స్థానిక కొత్తపేట, తాశీం వీధుల్లోని పీర్ల చావిడిళ్లలో పీర్లను రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. చాందీనీలతో అలంకరించిన ట్రాక్టర్లలో పీర్లను నిలిపి గ్రామపురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాలతో, సూలాలకు కొబ్బరి గెన్నలను అమర్చి కాల్చుకొంటూ ఊరేగింపు సాగింది. ముస్లింలతో పాటు హిందువులు పీర్లకు చదవింపులు ఇచ్చారు. అనంతరం ఆయా పీర్ల చావిడ్ల దగ్గర పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు జమీర్, జమీలా, బండరాజు, మౌలా, గయాజ్ పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవలో అభ్యంతరాలు తెలపండి



మాట్లాడుతున్న ఏఓ మంజుల

నిమ్మనపల్లె : రైతులకు ప్రభుత్వం అందించనున్న అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా నిధులు పొందేందుకు అర్హులైన రైతులు స్టేటస్ చెక్‌చేసుకుని, అభ్యంతరాలు ఉంటే సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో తెలపాలని వ్యవసాయాధికారి మంజుల తెలిపారు. బుధవారం మండలంలోని రెడ్డివారిపల్లె, రాచవేటివారిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటలసాగు, యాజమాన్య పద్ధతులపై రైతులకు సూచనలు అందించారు. అనంతరం మాట్లాడుతూ...అన్నదాత సుఖీభవ పథకానికి దరఖాస్తు చేసుకున్న రైతులు జాబితాలో తమ పేర్లను పరిశీలించుకుని, అర్హతలను నిర్ధారించుకోవాలన్నారు. ఈనెల 13 వరకు రైతుసేవా కేంద్రాల్లో అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలు సరిచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాచవేటివారిపల్లె సర్పంచ్ సుబ్రహ్మణ్యం, వీఏఏలు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో అర్హుల జాబితా

కలికిరి: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి అర్హుల జాబితాను అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి హేమలత తెలిపారు. రైతులు వారి పేర్లను చూసుకోవచ్చని, సమస్యలుంటే సిబ్బంది ద్వారా ఫిర్యాదు నమోదు చేసుకోవాలన్నారు. వెబ్‌ల్యాండ్‌లో ఖాతాకు ఆధార్ అనుసంధాన సమస్యలపై ఇప్పటికే రెవెన్యూ అధికారులకు పంపడం జరిగిందని, ఇలాంటి రైతులు రెవెన్యూ అధికారులను సంప్రదించి ఆధార్ అనుసంధానం చేయించుకోవాలన్నారు. ఇతర సమస్యలకు ఆర్ఎస్‌కే కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించవచ్చని ఏఓ తెలిపారు.

భూములను పరిశీలించిన సబ్ కలెక్టర్



మ్యాప్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

పెద్దమండ్యం: బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు కోసం కేటాయించిన భూములను మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ బుధవారం పరిశీలించారు. మండలంలోని దిగువపల్లె గ్రామంలో ప్రభుత్వ భూముల్లో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు కోసం ఇటీవల అధికారులు సర్వే నిర్వహించారు. అధికారుల సర్వేలో 700 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించినట్లు సబ్ కలెక్టర్‌కు తహశీల్దార్ వివరించారు. ఈ సందర్భంగా రూపొందించిన మ్యాప్‌ను సబ్ కలెక్టర్ పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. మ్యుటేషన్‌లు, రీ సర్వే, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల జారీపై సిబ్బందితో మాట్లాడారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రీ సర్వే నిర్వహించాలని ఆయన సూచించారు. మ్యుటేషన్ ఫైళ్లను తెప్పించుకొని పరిశీలించారు. కార్యాలయానికి వచ్చే రైతులకు, ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దార్ తేజస్వి, విలేజ్ సర్వేయర్‌లు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

ఆరోగ్యరంగంలో ఏఐ విప్లవాత్మక పాత్ర



వైద్యరంగంలో ఏఐ ఉపయోగాలను వివరిస్తున్న డాక్టర్ షారన్ ప్రియా అలెగ్జాండర్

మదనపల్లె రూరల్ : వైద్య ఆరోగ్య రంగంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) విప్లవాత్మక పాత్ర పోషిస్తోందని చీఫ్ సైంటిస్ట్ డాక్టర్.శిల్పా నాయుని అన్నారు. ఆల్ ఇండియా కౌన్సిల్ ఫార్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో, పట్టణంలోని శ్రీ జ్ఞానాంబికా డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా మూడోరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్.శిల్పా నాయుని ఆరోగ్య సంరక్షణ రంగంలో డయాగ్నస్టిక్ ఇమేజింగ్‌లో ఏఐ ఎలా విప్లవాత్మక మార్పులు చేస్తోందో వివరించారు. అధునాతన అల్గోరిథం, మెషిన్ లెర్నింగ్‌ను సమగ్రపరచడం ద్వారా ఎక్స్-కిరణాలు, ఎంఆర్‌ఐలు, సీటీ స్కాన్, అల్ట్రాసౌండ్‌లు, డీఎక్స్‌ఏ తదితర వైద్య చిత్రాల వివరణను ఏఐ గణనీయంగా పెంచుతుందన్నారు. ఆరోగ్యసంరక్షణ నిపుణులు వైద్య పరిస్థితులను ఎక్కువ వేగం, కచ్చితత్వంతో గుర్తించడంలో, నిర్ధారించడంలో ఏఐ ఎంతగానో సహాయపడుతుందన్నారు. రోగి ఫలితాలను అంచనా వేయడమే కాకుండా అధిక నాణ్యత, సంరక్షణను అందించడంలో వైద్యులకు మద్దతు ఇస్తుందన్నారు. మధ్యాహ్నం జరిగిన కార్యక్రమంలో డాక్టర్.షారన్ ప్రియా అలెగ్జాండర్, ఔషధ ఆవిష్కరణ, వ్యక్తిగతీకరించిన ఆరోగ్యసంరక్షణలో ఏఐ పరివర్తన పాత్రను విశదీకరించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్.రాటకొండ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ సురభి రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

పప్పుజాతి గడ్డితో అధికలాభాలు

కలికిరి: పశువులకు పప్పుజాతి గడ్డితో అధిక పాలదిగుబడి సాధించవచ్చని కలికిరి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వెంకటమునినాయుడు అన్నారు. పశుగ్రాస వారోత్సవాలలో భాగంగా బుధవారం మండలంలోని మర్రికుంటపల్లి రైతు సేవా కేంద్రంలో పాడి రైతులకు పశుగ్రాస వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుగ్రాసంలో 25శాతం పప్పుజాతి పశుగ్రాసాలైన హెడ్జిలూసర్న్, సుబాబుల్, అవిసె, అలసంద, ఉలవ వంటి కలిసి వాడకం వలన పాల ఉత్పత్తి పెరగడంతో పాటు పశువులు ఆరోగ్యకరంగా ఉంటాయన్నారు. ఉపాధి పథకం ద్వారా పశుగ్రాసం పెంపకం చేపట్టాలని రైతులకు ఎంపీడీఓ భానుమూర్తిరావు సూచించారు. పశువైద్యాధికారులు గిరినాథ్ రెడికడ, కీర్తి, జగన్‌మోహన్ రెడ్డి. సిబ్బంది క్రిష్ణవేణి, పవన్, అనిల్ పాల్గొన్నారు.

మెగా పీటీఎం సమావేశాలు సజావుగా జరపాలి

కేవీపల్లె : మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ సమావేశాలు సజావుగా నిర్వహించాలని ఎంపీడీఓ సుధాకర్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 9.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. విద్యార్థులు తమ తల్లిపేరులో ఒక్క మొక్కనాటే కార్యక్రమానికి అవసరమైన మొక్కలు పంపిణీ చేసినట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ నరేంద్రకుమార్, ఎస్ఐ చిన్నరెడ్డెప్ప, ఎంఈవోలు రెడ్డిబాషా, సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్య మెలకువలు పాటించాలి



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్

పీలేరు : గర్భిణులు ఆరోగ్య మెలకువలు పాటించాలని డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. బుధవారం తలపుల పీహెచ్‌సీలో 28 మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. సురక్షిత మాతృత్వం కోసం నిర్దేశించిన రోజుల్లో ఆరోగ్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ అందించే ఆరోగ్య పథకాలు, మెరుగైన ఆరోగ్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఐరన్ ఫోలిక్ యాసిడ్, ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఈఈ కొండయ్య, పర్యవేక్షకులు కుసుమ, ల్యాబ్ టెక్నీషియన్ కుమార్, ఏఎన్ఎంలు నాగవేణి, షామున్నిషా, సీహెచ్‌వో కుముద ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్పత్రి నిధులు సద్వినియోగం చేసుకోవాలి

– స్పెషల్ ఆఫీసర్, డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి



ఆస్పత్రి నిధులపై ఆరా తీస్తున్న స్పెషల్ ఆఫీసర్ అమరనాథరెడ్డి

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె సీహెచ్‌సీ ఆస్పత్రికి ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను సకాలంలో ఖర్చు చేసి సద్వినియోగం చేసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్, డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన సీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో డాక్టర్లు, సమస్యలు, ప్రభుత్వ నిధులు, ఖర్చులను డాక్టర్ విక్రాంత్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సౌమ్యలను అడిగి తెలుసుకున్నారు.హెచ్‌డీఎఫ్ నిధులు ల్యాప్స్ కాకుండా వినియోగించుకోవాలన్నారు. రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. వారి వెంట ఎంసీడీఓ థామస్‌రాజా, ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, ఏపీఓ అంజనప్ప, హెడ్ సిస్టర్ గ్లోరీ లిటిల్‌ఫ్లవర్ ఉన్నారు.

గిరిజన బాలుర వసతి గృహం తనిఖీ: కోడిగుడ్డు, చిక్కి అందని వైనం, సమస్యలతో విద్యార్థులు సతమతం అవుతున్న స్థానిక గిరిజన బాలుర వసతి గృహాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ అమరనాథరెడ్డి తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, ఇంగ్లీషు, సైన్సు టీచర్లు లేకపోవడంతో విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపడం లేదని టీచర్లు తెలిపారు. విద్యార్థులను ప్రశ్నించి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భోజనం నాణ్యతగా ఉండటం లేదని, గత రోజులుగా మెనూ పాటంచడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారి ఇవ్వాల్సిన కోడిగుడ్డు, చిక్కి ,పాలు ,పెరుగు ఇవ్వడం లేదని ఆరోపించారు. అనంతరం వంటశాల,స్టోరు రూము పరిశీలించారు. సన్న బియ్యం కాకుండా రేషన్ బియ్యంతోనే అన్నం వండి వడ్డించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇన్‌చార్జ్ వార్డన్ రంగనాయకులు లేకపోవడంతో ఫోన్‌లో సంప్రదించారు. హాస్టల్ దుస్థితిపై అసహనం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ, ఎంఈఓ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం జయప్రదం చేయండి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

పీలేరు : స్థానిక కడప మార్గంలోని ఎంఎం కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం 3 గంటలకు జరిగే కార్యక్రమానికి ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమరనాథరెడ్డి హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ హబీబ్‌బాషా, నాయకులు చక్రధర్, ఆనంద్, లోకనాథరెడ్డి, ఆబిద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూ అధ్యాపకురాలికి ఉత్తమ సేవా అవార్డు

కలికిరి: జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ హెచ్‌ఓడీ, ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ కో-ఆర్డినేటర్ డా. కె.అపర్ణ రెడ్‌క్రాస్ సొసైటి నుంచి ఉత్తమ సేవ అవార్డు పొందారు. 2023-24 సంవత్సరంలో ఆమె చేసిన సేవలను గాను రెడ్‌క్రాస్ సొసైటీ వారు అవార్డుకు ఎంపిక చేసి బుధవారం విజయవాడలో జరిగిన వార్షిక జనరల్‌బాడీ సమావేశంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అవార్డును ప్రదానం చేశారు. ఆమె అవార్డుకు ఎంపిక కావడంపై జేఎన్టీయూ అనంతపురం అధికారులు, కలికిరి కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ త్యాగరాజన్, సహచర అధ్యాపకులు, సిబ్బంది అభినందించి, హర్షం వ్యక్తపరచారు.